గయారాంలకు గడ్డుకాలం

మొదటిపేజీ తరువాయి...

స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గత మే నెలలో తేల్చి చెప్పింది. అలా చేయనిపక్షంలో ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ హైకోర్టు తలుపులు తట్టేందుకు తాజా తీర్పుతో సుప్రీం వీలుకల్పించింది. దీంతో గోడదూకే వారికి చట్టసభలో ఉన్న సభ్యత్వం కోల్పోవడమే కాదు.. రాజకీయ భవిష్యత్తు కూడా ఉండబోదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పదో షెడ్యూల్‌లో కీలక అంశాలు

రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో 52వ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని చేర్చారు. అందులోని పేరాగ్రాఫ్ 1(2)ఏ ప్రకారం.. ఒక పార్టీ ఎన్నికల ప్రణాళికతో ఎన్నికైన ప్రతినిధి ఆ పార్టీ విధివిధానాలకు లోబడి ఉండాలి. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా, పార్టీకి విరుద్ధంగా ఎలాంటి చర్యలకు పాల్పడరాదు. అలా చేస్తే.. సదరు సభ్యుడు స్వచ్ఛందంగా సొంత పార్టీని వీడినట్టే. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 1(2) బి ప్రకారం.. ఒక పార్టీ మ్యానిఫెస్టోపై గెలిచిన వ్యక్తి వేరే విధివిధానాలకు చెందిన మరో పార్టీకి అనుకూలంగా చట్టసభల్లో ఓటు వేస్తే.. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం తన సభ్యత్వం కోల్పోతారు. పార్టీ విప్ అంశం స్పీకర్ ద్వారానే అమలు అవుతుంది కాబట్టి విప్ ధిక్కరణకు పాల్పడిందీ లేనిదీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. విప్‌ను ధిక్కరించినట్లుగా ఫిర్యాదు అందినవెంటనే స్పీకర్ చర్యలు తీసుకోవాలి. పార్టీ నుంచి చీలిపోయిన వర్గానికి గుర్తింపునిచ్చే అంశాన్ని 2004 లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేశారు.

స్పీకర్ ఎప్పుడు తీర్మానం చేసినా..

సుభాశ్ దేశాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు.. పార్టీ విధివిధానాలకు వ్యతిరేకంగా, పార్టీ అనుమతి లేకుండా వేరే పార్టీ వారిని కలిసిన చట్టసభ సభ్యుడు పార్టీ ఫిరాయింపునకు పాల్పడినదాని కిందే లెక్క. పార్టీ ఫిరాయింపు ఉత్తర్వులు స్పీకర్ తీర్మానం చేసిన తేదీ నుంచి కాకుండా.. సదరు వ్యక్తి సొంత పార్టీని కాదని వేరే పార్టీ నాయకులను కలిసినప్పటి నుంచే అమల్లోకి వస్తా యి. చట్టసభ్యుడు పార్టీ ఫిరాయింపునకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదుపై స్పీకర్ జారీచేసిన నోటీసు సదరు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న సభ్యుడు అందుకున్నాక రెండు వారాల్లోగా స్పీకర్ దానిపై నిర్ణయం తీసుకోవాలి.

నోటీసు జారీపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

స్పీకర్ నోటీసు ఎలా జారీ చేయాలనే అంశం కూడా సుప్రీంకోర్టు సుభాశ్ దేశాయ్ కేసులోనే కీలక ఆదేశాలు జారీ చేసింది. ఒక పార్టీ ఎన్నికల గుర్తుపై గెలిచిన చట్టసభ సభ్యుడు వేరే పార్టీ నాయకుడ్ని కలిసినట్టు పత్రికలు, టీవీల్లో వార్తలు ప్రచురణ/ప్రసారం అయితే.. దానినే నోటీసుగా పరిగణించాలి. ఈ ఉత్తర్వుల ప్రకారం పార్టీ ఫిరాయింపుదారుడు తనకు నోటీసు అందలేదని బకాయించే అవకాశాలు లేకుండా సుప్రీంకోర్టు చేసింది.

శివసేన ఎమ్మెల్యేల కేసు ఇది

శివసేన ఎన్నికల మ్యానిఫెస్టోపై గెలిచిన 55 మంది ఎమ్మెల్యేల్లో 40 మంది బయటకువచ్చి ఏక్‌నాథ్ షిండేకు మద్దతు పలికారు. షిండేతో సహా తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిప్యూటీ స్పీకర్‌ను శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే కోరారు. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే.. దానిని డిప్యూటీ స్పీకర్ తిరస్కరించడంతో పాటు తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని నోటీసు జారీచేశారు. ఇలా శివసేనలోని ఏక్‌నాథ్ షిండే, ఉద్ధవ్ ఠాక్రే వర్గాలు పరస్పరం గత జూలైలో దాఖలుచేసిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ రాహుల్ నార్వేకర్ తీవ్ర జాప్యం చేశారు. ఈ జాప్యాన్ని గత అక్టోబర్ 13న సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలనే ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడానికి వీల్లేదని స్పష్టంచేసింది. నిర్ణీత కాలంలోగా నిర్ణయం తీసుకోవాలి. అలా చేయకపోతే న్యాయ సమీక్ష చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టులను కోరే హక్కు ఫిర్యాదు చేసే పార్టీకి ఉంటుందని తేల్చిచెప్పింది. నిర్ణీత వ్యవధిలో పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంటూ తాము ఇదివరకే ఇచ్చిన ఉత్తర్వులను స్పీకర్ బేఖాతరు చేయడంపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేసింది. పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ అడిగే కాలవ్యవధి సంతృప్తిగా లేనిపక్షంలో, ఉల్లంఘించడానికి వీల్లేని విధంగా ఉత్తర్వులు ఇస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరించింది. కోర్టు ఆదేశాలను పరిహసించేలా స్పీకర్ చర్యలు ఉండొద్దని స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకొనేందుకు గడువును పలుమార్లు (జూలై 10, సెప్టెంబర్ 18, అక్టోబర్ 13, డిసెంబర్ 31) పొడిగించిన సుప్రీం చివరకు 10 జనవరి 2024ను డెడ్‌లైన్‌గా విధించింది. దీంతో జనవరి 10న ఠాక్రే, షిండే వర్గాల అనర్హత పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారు.

మణిపూర్ మంత్రి కేసు ఇది!

మణిపూర్‌కు చెందిన ప్రస్తుత బీజేపీ నేత తౌనోజామ్ శ్యామ్‌కుమార్ సింగ్ 2017లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం అధికార బీజేపీలో చేరారు. దీంతో క్యాబినెట్‌లో మంత్రి హోదా దక్కింది. తమ పార్టీ టికెట్‌పై గెలిచి బీజేపీలో చేరిన శ్యామ్‌కుమార్‌పై అనర్హతవేటు వేయాలంటూ 2017 లో కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. మూడేండ్లపాటు ఈ పిటిషన్‌పై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ కేసును సుప్రీం 18 మార్చి 2020న విచారించి శ్యామ్‌కుమార్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. అంతేకాకుండా, తాము ఉత్తర్వులు ఇచ్చే వరకూ శ్యామ్‌కుమార్ శాసనసభలో అడుగుపెట్టకూడదని ఆదేశించింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను అనుసరించి అనర్హత పిటిషన్ మీద స్పీకర్ మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ విధంగా స్పీకర్ అధికారాలపై కోర్టు పరోక్షంగా పరిమితులు విధించింది.

స్పీకర్ కాలయాపన చేయడానికి వీల్లేదు

రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల చట్టంపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉండేది. స్పీకర్ కూడా ఒక పార్టీ తరపున గెలిచిన వ్యక్తి కావడం వల్ల వేరే పార్టీలకు చెందిన చట్టసభ సభ్యులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్టు సదరు పార్టీ నుంచి ఫిర్యాదు అందితే.. స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేసే విధానం సర్వసాధారణంగా మారింది. స్పీకర్ నిర్ణయం తీసుకోనిపక్షంలో దానిపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టు న్యాయ సమీక్షకు ఇప్పటివరకు ఆస్కారం ఉండేది కాదు. సుభాశ్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు నిర్దిష్ట గడువు విధించింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వ్యక్తికి స్పీకర్ నోటీసు జారీ చేశాక రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని, ఆ విధంగా స్పీకర్ నిర్ణయం తీసుకోనిపక్షంలో రాజ్యాంగ ధర్మాసనాలైన హైకోర్టు/సుప్రీంకోర్టులను ఆశ్రయించవచ్చని తేల్చిచెప్పింది.

ఫిరాయింపుదారుల్లో గుబులు ..

10వ షెడ్యూల్‌లోని 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' ప్రకారం.. అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకొనే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుంది. ఈ నిర్ణయాన్ని స్పీకర్ ఈ పరిమిత సమయంలోపు తీసుకోవాలనే నిబంధన గతంలో లేదు. దీంతో రాజకీయ ప్రయోజనాలను అనుసరించి అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగేది. దీనిపై దృష్టిసారించిన సుప్రీం ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని త్వరగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్లకు డెడ్‌లైన్లను విధిస్తున్నది. ధర్మాసనం ఆదేశాలను పాటించకపోతే, కోర్టు ధిక్కరణ కిందికి వస్తుంద న్న భావనతో స్పీకర్లు నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. మొత్తానికి మహారాష్ట్ర, మణిపూర్ ఉదంతాలపై సుప్రీం తీర్పు పెను సంచలనమని న్యాయ నిపుణులు చెప్పున్నారు. దీంతో ఫిరాయింపుదారుల్లో గుబులు నెలకొంది.

కోదండరాం సమాచారం ఇవ్వకుండా వచ్చారు

- నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తా
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ కోదండరాం తదితరులు ఎమ్మెల్సీగా ప్రమాణం చేయడానికి వస్తే తాను గైర్హాజరు అయినట్టు జరుగుతున్న ప్రచారాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోదండరాంతోపాటు మరో సభ్యుడు తనకు సమాచారం ఇవ్వకుండా తమ కార్యాలయానికి వచ్చారని పేర్కొన్నారు. తాను కొన్ని రోజులుగా దగ్గు, గొంతునొప్పి, జ్వరంతో బాధపడుతున్నానని, ఈ కారణంగానే ఈ నెల 26న రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంతోపాటు 27 నుంచి ముంబైలో జరుగుతున్న ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌కు వెళ్లలేదని తెలిపారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ నెల 26న తనను కలిసి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి ఈ నెల 31న మధ్యాహ్నం 3.30 గంటలకు సమయం కేటాయించాలని కోరారని చెప్పారు. దానికి తాను అంగీకరించడంతోపాటు అదే రోజు ఇతర సభ్యుల ప్రమాణ స్వీకారానికి కూడా ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్టు వివరించారు. అయితే, కోదండరాంతో పాటు నూతనంగా ఎన్నికైన ఇతర ఎమ్మెల్సీలు సోమవారం తమ కార్యాలయానికి సమాచారం ఇవ్వకుండా వచ్చారని వెల్లడించారు. శాసన మండలి చైర్మన్‌గా నిష్పక్షపాతంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.

లోకం పోకడ



చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.2°c	33.1°c
రంగారెడ్డి	11.3°c	34.1°c
మెదక్	13.1°c	32.9°c
ఖమ్మం	16.0°c	31.0°c
వరంగల్	17.0°c	30.0°c
నిజామాబాద్	17.4°c	32.7°c
నల్లగొండ	17.6°c	29.0°c
హైదరాబాద్	17.6°c	29.1°c
కరీంనగర్	18.0°c	31.0°c
మహబూబ్‌నగర్	18.6°c	32.0°c

రాష్ట్రంలో మరో 8 దవాఖానలకు 'ఎన్‌క్వాస్'

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 8 ప్రభుత్వ దవాఖానలకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ మంజూరు చేసింది. కరీంనగర్ జిల్లా కొండాపాక, నల్లగొండ జిల్లా వింజమూర్, సూర్యాపేట జిల్లా యండ్లపల్లి, కాసర్లపహాడ్, ఆదిలాబాద్ జిల్లా వాఘాపూర్, నిపని హెచ్‌డబ్ల్యూఎస్‌లకు, మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట, వనపర్తి జిల్లా కమాలుద్దీన్‌పూర్ పీహెచ్‌సీలకు ఈ సర్టిఫికెట్లు దక్కాయి. దవాఖానలోని అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రమాణాలు పాటించడం, నాణ్యమైన సేవలు అందించడంపై కేంద్ర బృందం అధ్యయనం చేసి ఈ ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది.

కొడంగల్‌లో మెడికల్ కాలేజీ!

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితుల్లో సరైన వైద్యం అందించే వీలుంటుందని అన్నారు. ఆరోగ్యశ్రీకి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన సడలించే అంశాన్ని పరిశీలించాలన్నారు. టీచింగ్ హాస్పిటళ్లు, ప్రభుత్వ దవాఖానలకు పెండింగ్‌లో ఉన్న రూ.270 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఇకపై ప్రతి నెల 15వ తేదీలోగా ప్రభుత్వ దవాఖానలకు, మూడు నెలలకోసారి ప్రైవేటు దవాఖానలకు ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయాలని స్పష్టం చేశారు.

వైద్యారోగ్య సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి దామోదర

దవాఖానల నిర్మాణం వేగవంతం

వరంగల్ హెల్త్ సిటీ, ఎల్బీనగర్, సనత్‌నగర్, అల్వాల్‌లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖానల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. వైద్యుల కొరత లేకుండా దవాఖానలకు మెడికల్ కాలేజీలను అనుసంధానం చేయాలని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఉస్మానియా దవాఖానలో 'వారసత్వ భవనం'కు సంబంధించి కోర్టు సూచనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. మెడికల్ కాలేజీలతో అనుబంధంగా ఉన్న ప్రభుత్వ దవాఖానల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను ఫార్మా కంపెనీలకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ అర్వీ కర్ణణ్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో విచాలాచ్చి పాల్గొన్నారు.

మోదీ.. తెలంగాణకు సాయమేదీ?

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేంద్రంలోని మోదీ సర్కారు రాష్ట్రంపై అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అడిగిన దానికంటే ఎక్కువ నిధులిస్తున్న మోదీ సర్కారు.. తెలంగాణపై మాత్రం అంతులేని వివక్ష చూపుతున్నది. ప్రత్యేకించి గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయంలో ఈ వివక్ష మరీ అధికంగా ఉన్నది. మార్చి నెలాఖరుతో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కేంద్రం నుంచి గ్రాంట్ రూపేణా రూ.41,259 కోట్లు అందుతాయని మన రాష్ట్ర బడ్జెట్‌లో అంచనా వేయగా.. మూడో త్రైమాసికం నాటికి మోదీ సర్కారు రూ.4,533 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇది రాష్ట్ర అంచనాలో కేవలం 11 శాతమే. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్రం నుంచి అందే గ్రాంట్ రాష్ట్ర అంచనాలో 25 శాతానికి మించకపోవచ్చని ఆర్థిక నిపుణులు చెప్పున్నారు. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు కేంద్రం ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా అంచనాకు మించి భారీగా నిధులిచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.16,290 కోట్ల గ్రాంట్ వస్తుందని ఆ రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా.. మూడో త్రైమాసికం నాటికి కేంద్రం రూ.16,582 కోట్లు అందించింది. ఇది ఆ రాష్ట్ర అంచనాలో 102 శాతానికి సమానం. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్రం గుజరాత్‌కు అందించే గ్రాంట్ మరో రూ.5-6 వేల కోట్ల వరకు ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. తెలంగాణతో పోలిస్తే మోదీ ప్రాతినిధ్య రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు కూడా కేంద్రం ఆశాజనకంగానే నిధులు అందించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.1,01,203 కోట్ల గ్రాంట్ అందుతుందని ఆ రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేయగా.. డిసెంబర్ చివరినాటికి మోదీ సర్కారు రూ. 26,372 కోట్లు ఇచ్చింది. ఇది ఆ రాష్ట్ర అంచనాలో 26 శాతానికి సమానం.

చెరువులో మీటర్ అడిగినా ఇస్తం!

- కబ్జాలపై ఓ విద్యుత్తు శాఖ అధికారి నిర్లక్ష్య సమాధానం
- అవాక్కయిన రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు
- చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సీరియస్
- నమస్తే ఎఫెక్ట్.. కలెక్టర్ ఆదేశంతో అధికారుల సమావేశం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని చందన చెరువు శిఖం, కుర్మల్‌గూడలోని సర్వేనంబర్ 46 ప్రభుత్వ భూమి సహా పలుచోట్ల కబ్జాలపై 'నమస్తే తెలంగాణ' కథనాలకు ప్రభుత్వ యంత్రాంగం కదిలొచ్చింది. రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశాలతో సోమవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కబ్జాలకు తొలి అడుగుగా అక్రమార్కులు కరెంటు మీటర్ తీసుకుంటున్నారనే చర్చ వచ్చింది. దీంతో సమావేశంలోనే విద్యుత్తుశాఖ అధికారికి ఓ రెవెన్యూ అధికారి ఫోన్ చేయగా పైవిధంగా నిర్లక్ష్యపు సమాధానం వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ సంభాషణను ఫోన్‌లో స్పీకర్ పెట్టి అందరూ విని అవాక్కయినట్టు సమాచారం. అదేవిధంగా మున్సిపల్‌శాఖ నుంచి అక్రమార్కులకు ఇంటి నంబర్ల రూపంలో సహకారం అందుతున్నదనే చర్చ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఈ వివరాలన్నింటినీ జిల్లా కలెక్టర్‌కు వివరించి, కబ్జాల తొలగింపునకు కార్యాచరణ ఎలా అమలు చేయాలనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో అక్రమార్కులు, వారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. పోలీస్ బలగాల సహకారంతోనే ఆక్రమణల తొలగింపు సాధ్యం అవుతుందని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌యాదవ్, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, బడంగ్‌పేట, జల్‌పల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు సుమన్‌రావు, వసంత, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

- రెవెన్యూ అధికారి: హలో.. మీ విద్యుత్తు శాఖ వాళ్లు ఇష్టమొచ్చినట్టు కరెంటు మీటర్లు ఇస్తున్నరు. అందుకే ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కడుతున్నరు. అలా ఎలా మీటర్లు ఇస్తారు?
- విద్యుత్తు శాఖ అధికారి: అవును ఇస్తాం. మరి మీరేం చేస్తున్నారు?
- రెవెన్యూ అధికారి: చెరువులో అడిగినా ఇస్తారా?
- విద్యుత్తు శాఖ అధికారి: ఇస్తం. చెరువులో కరెంటు మీటర్ అడిగినా ఇస్తాం. ఇండ్లు కట్టుకుంటే మీరు కూలగొట్టండి

(ఇదీ! రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమావేశంలో పలు శాఖల అధికారులను అవాక్కయ్యేలా చేసిన సంభాషణ)

పీసీబీ కార్యాలయంలో మంత్రి సురేఖ తనిఖీ

- ఆఫీసులో లేని సిబ్బందిపై ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సనత్‌నగర్‌లోని తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయాన్ని సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఉన్నతాధికారితోపాటు పలువురు అధికారులు, సిబ్బంది లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సెక్షన్‌ను సందర్శించి, ఫైళ్లను పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్‌లో నమోదైన వివరాలతో కూడిన హాజరు పట్టికను పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడం, నిర్ణీత సమయానికి కార్యాలయానికి రాకుండా ఇష్టారీతిన వ్యవహరించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. అనంతరం కాలుష్య నివారణ, నియంత్రణకు బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న పరిశోధనలు, చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

బీసీలకు డిప్యూటీ సీఎంసహా 5 మంత్రి పదవులివ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణలో ఉపముఖ్యమంత్రి పదవితోపాటు ఐదు మంత్రి పదవులను బీసీలకే ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. త్వరలో భర్తీ చేయబోయే కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు జనాభా ప్రకారం 50 శాతం పదవులివ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు 20 వేల కోట్లు కేటాయించాలని, బీసీబంధు పథకం ప్రవేశపెట్టి ప్రతి బీసీ కుటుంబానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

వీఆర్వోలను వెనక్కి తీసుకురావాలి

- మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ప్రజలకు సంక్షేమ పథకాలను సమర్థంగా అందించేందుకు, రెవెన్యూ సేవలను నిరంతరంగా కొనసాగించేందుకు, ప్రభుత్వ భూములు కాపాడేందుకు గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయాలని ట్రెసా ప్రతినిధులు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర శాఖల్లోకి పంపిన వీఆర్వోలను ఆప్షన్స్ ద్వారా తిరిగి రెవెన్యూలోకి తీసుకొచ్చి వారి అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. చనిపోయిన వీఆర్వోల(178) కుటుంబాలను ఆదుకొని కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు నేతలు తెలిపారు. కారుణ్య నియామకాలను నెలరోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ట్రెసా అధ్యక్షుడు వంగరవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, పూర్వ వీఆర్వో జేఏసీ నాయకులు గోల్కొండ సతీశ్, సుధాకర్‌రావు, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వాటిది ద్వంద్వ వైఖరి

- మాదిగల డిమాండ్లను నెరవేర్చని
- కాంగ్రెస్, బీజేపీ: వంగపల్లి ఫైర్

ముషీరాబాద్, జనవరి 29: మాదిగల చిరకాల కోరిక, న్యాయమైన ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను పరిష్కరించకుండా కాంగ్రెస్, బీజేపీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. సోమవారం విద్యానగర్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీజేపీకి మాదిగల పట్ల ఏ మాత్రం అభిమానం ఉన్నా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు.

వేసవిలో విద్యుత్తు కోతలుండవు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): వచ్చే వేసవి కాలంలో ఎటువంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తును నిరంతరం సరఫరా చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం చీకట్లో ఉండాలని కలలుకంటున్న సోషల్ మీడియా వీరుల ఆశలను, అసలు స్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో విద్యుత్తు సరఫరా గత సంవత్సరంతో పోల్చితే 2023 డిసెంబర్ 7 నుంచి గణనీయంగా మెరుగుపడింద